


సింగరేణిని అమ్మివేయడానికి కాంగ్రెస్ కుట్రలు 8లో..
గాలికి కూలిపోయే బ్రిడ్జిలు, ప్రాజెక్టులు కట్టిన బీఆర్ఎస్ 8లో..

రుణమాఫీపై ఆశలు



● ఆగస్టు 15లోపు చేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి ● విస్తృతంగా ప్రచారం చేస్తున్న ఎంపీ అభ్యర్థులు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ఈ ఏడాది ఆగస్టు 15వ తేదీలోపు రెండు లక్షల రూపాయల వరకు పంట రుణాల మాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. దీంతో జిల్లాలో 700 నుంచి 750 కోట్ల రూపాయల వరకు మాఫీ అయ్యే అవకాశాలున్నాయి. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున దీనికి సంబంధించిన విధి విధానాలను ప్రభుత్వం ఇంకా రూపొందించలేదు. ఎప్పటినుంచి ఎప్పటి వరకు తీసుకున్న రుణాలను మాఫీ చేస్తారు, గతంలో రుణ మాఫీకి అర్హత పొంది, డబ్బులు రానటువంటి రైతులకు కూడా మాఫీ చేస్తారా, లేదా అనే విషయం తెలియడం లేదు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే డిసెంబర్ 9వ తేదీ నుంచే ఆరు గ్యారంటీ పథకాలతో పాటు పలు పథకాలను, 2 లక్షల రూపాయల వరకు పంట రుణ మాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఆ ఎన్నికల్లో రాష్ట్రంలో మెజారిటీ సీట్లు సాధించిన కాంగ్రెస్ పార్టీ డిసెంబర్ 7వ తేదీన అధికారం చేపట్టింది. కానీ రుణమాఫీ చేయలేదు.

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం, రూ. 500కే వంట గ్యాస్, ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యాన్ని 5 లక్షల నుంచి 10 లక్షల రూపాయలకు పెంచారు. 200 యూనిట్ల వరకు విద్యుత్‌ను వినియో గించే వాళ్లకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఒక్కో నియోజవర్గానికి 3,500 చొప్పున ఇళ్ల కేటా యించగా, లబ్ధిదారులను ఎంపిక చేసే లోపే ఎన్నికల షెడ్యూల్ వచ్చిం ది. ఇంకా మహిళలకు నెలకు రూ. 2,500 ఇవ్వడం, రైతు భరోసా ద్వారా రైతులు, కౌలు రైతులకు ఏడాదికి ఎకరానికి రూ.15 వేలు ఇవ్వడం, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు ఇవ్వడం, 2లక్షల రుణ మాఫీ, పింఛన్ల పెంపు, యువ వికాసం పథకాలను అమలుచేయలేదు. అయితే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మాత్రం రైతులకు 2 లక్షల రూపాయల వరకు ఆగస్టు 15వ తేదీలోపు రుణ మాఫీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ అంశాన్ని పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సీఎం నుంచి మొదలుకుని మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ నాయకుల వరకు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

జిల్లాలో మాఫీ కానున్న రూ.700-750 కోట్లు

గత ప్రభుత్వం కూడా ఎన్నికల సందర్భంగా లక్ష రూపాయల వరకు రుణ మాఫీ చేస్తామని, నాలుగు విడతల్లో డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించింది. నాలుగేళ్లలో 25వేల వరకు రుణాలు పొందిన వారి రుణాలనే మాఫీ చేసింది.

అసెంబ్లీ ఎన్నికలకు ముందు మిగతా మంది రైతులకు డబ్బులను వారి ఖాతాల్లో జమ చేయడం ప్రారంభించింది. కానీ అందరు రైతుల ఖాతాల్లో డబ్బులను జమ చేయలేదు. జిల్లాలో 92 వేల మంది రైతులకు సుమారు 542 కోట్ల రూపాయలు మాఫీ చేయాల్సి ఉండగా, 49 వేల మంది రైతులకు మాత్రమే 257 కోట్ల రూపాయలు రైతుల ఖాతాలో జమచేసింది. మిగతా రైతులకు డబ్బులు జమ చేయలేదు. కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వంపై రైతులు ఆశలు పెంచుకోగా, ఆగస్టు 15 వరకు రుణ మాఫీ చేస్తామని ప్రకటిస్తుండడంతో వారిలో ఆశలు చిగురిస్తున్నాయి. గతంలో రుణ మాఫీకి అర్హత సాధించిన వారి రుణాలను కూడా మాఫీ చేయాలని రైతులు అంటున్నారు. గడిచిన ఏడాది 1600 కోట్ల పంట రుణాల లక్ష్యానికి గాను అందులో సగం రుణాలు మాత్రమే బ్యాంకర్లు ఇచ్చారు.

ఈ లెక్కన జిల్లాలో 750 నుంచి 800 కోట్ల రూపాయల వరకు పంట రుణాలు మాఫీ అయ్యే అవకాశాలున్నాయి. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికలు జరుగుతుండడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేవుళ్ల మీద ప్రమాణం చేస్తూ 2 లక్షల రుణమాఫీ చేస్తామని చెబుతుండడం అనుమానాలను రేకెత్తిస్తున్నదని ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ నేతలు అంటున్నారు. రైతుల ఓట్ల కోసమే ముఖ్యమంత్రి ప్రకటనలు చేస్తున్నారని, ప్రభుత్వం ఏర్పాటైన నాటినుంచే రుణ మాఫీ అమలు చేస్తామన్న ప్రభుత్వం ఎందుకు అమలుచేయలేదని ప్రశ్నిస్తున్నారు. రైతులను నమ్మించేందుకు దేవుళ్ల మీద ప్రమాణాలు చేస్తారా అని విమర్శిస్తున్నారు. రైతులు మాత్రం రుణమాఫీ చేస్తారనే ఆశల్లోనే ఉన్నారు. ఇచ్చిన మాటకు ప్రభుత్వం కట్టుబడి ఉంటుందా, లేదా వేచి చూడాల్సిందే.

ధాన్యం తరలింపునకు వాహనాలను సిద్ధం చేయాలి

- అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

పెద్దపల్లిటౌన్, మే 9: కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలు సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ యాసంగి సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లపై జిల్లా అధికారులు, ధాన్యం రవాణా కాంట్రాక్టర్లు, రైస్‌మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ మాట్లాడుతూ ధాన్యం రవాణా కాంట్రాక్టర్లు కొనుగోలు కేంద్రాల వద్ద సరిపడా వాహనాలను ఏర్పాటు చేసి, కొనుగోలు చేసిన ధాన్యాన్ని త్వరితగతిన రైస్ మిల్లులకు సరఫరా చేయాలని ఆదేశించారు. పెద్దపల్లి జిల్లాలో ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 1,63,069 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, వీటిలో 1,61,539 మెట్రిక్ టన్నుల ధాన్యం రైస్ మిల్లులకు తరలించినట్లు తెలిపారు. రైస్‌మిల్లుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎటువంటి జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు దిగుమతి చేసుకోవాలని, రైస్ మిల్లుల వద్ద ఎటువంటి కోత విధించడానికి వీల్లేదని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో సివిల్ సప్లై జిల్లా మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి ప్రేమ్ కుమార్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కె.రవీందర్, జిల్లా సహకార అధికారి శ్రీమాల ధాన్యం, రవాణా కాంట్రాక్టర్లు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలి

-టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్



వైద్య సేవలపై అడిగి తెలుసుకుంటున్న అజయ్‌కుమార్

పెద్దపల్లి టౌన్, మే 9: ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలందించాలని టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్ వైద్య ఆరోగ్య సిబ్బందిని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఆస్పత్రి, మాతాశిశు సంక్షేమ ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహించారు. వైద్యులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. పలు అంశాలపై చర్చించిన అనంతరం అజయ్‌కుమార్ మాట్లాడారు. ఆస్పత్రి సిబ్బంది సమయ పాలన పాటించడంతో పాటు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వ్యహించవద్దన్నారు. రోగులతో మర్యాదగా ప్రవర్తించాలని, ఆస్పత్రి పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. వేసవి కాలంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు రోగులకు వివరించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ రమాకాంత్, ఆర్ఎమ్వో శౌరయ్య, డాక్టర్ శ్రీధర్‌లతో పాటు ఇతర సిబ్బంది ఉన్నారు.

రేపు ఎన్నికల ప్రచార వ్యయ వివరాలతో హాజరుకావాలి

పెద్దపల్లిటౌన్, మే 9: పెద్దపల్లి పార్లమెంట్ స్థానానికి జరుగుతున్న ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులు వారి ఎన్నికల ప్రచార వివరాలు, రిజిస్టర్‌తో ఈనెల 11న హాజరుకావాలని ఎన్నికల ఖర్చుల నమోదు నోడల్ అధికారి శ్రీమాల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గంలో పోటీలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల ప్రచారం కోసం చేసిన అన్ని ఖర్చుల వివరాలను ఎన్నికల వ్యయ రిజిస్టర్‌లో నమోదు చేసుకుని స్వయంగా గానీ లేదా ఎన్నికల ఏజెంట్ ద్వారా గానీ ఉదయం 11 గంటల వరకు కలెక్టరేట్ కార్యాలయం రూమ్ నంబర్ 207లో సమర్పించాలని పేర్కొన్నారు. లేని పక్షంలో ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పాటలతో ఓటు విలువ వివరించిన కళాకారులు

కాల్వశ్రీరాంపూర్, మే 9: మండలంలోని చిన్నరాతుపెల్లి గ్రామంలో గురువారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం సభ్యులు పాటలతో ఓటు విలువను వివరించారు. 18ఏళ్లు నిండిన యువతీయువకులు ఓటు హక్కు వినియోగించుకోవాలని కళాకారులు గ్రామస్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాకారులు ఈదునూరి పద్మ, కోంద్ర వెంకన్నగౌడ్, సలేంద్ర రాజన్న, ఇల్లందుల మల్లేష్‌గౌడ్, బుర్ర శంకర్‌గౌడ్, కన్నూరి రేణుక, జిన్న రమా పాల్గొన్నారు.

పారిశుధ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి

- జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత



రంగాపూర్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో ఆశాలత

పెద్దపల్లి రూరల్, మే 9 : గ్రామాల్లో పారిశుధ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారిణి ఆశాలత అన్నారు. గురువారం మండలంలోని రంగాపూర్ గ్రామంలో పారిశుధ్యంతో పాటు పలు పనులను డీపీవో పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె నీటి ట్యాంకుల ద్వారా నీటి సరఫరా, అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను పరిశీలించారు. అనంతరం పోలింగ్ కేంద్రాల్లో వసతులను పంచాయతీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా డీపీవో ఆశాలత మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని, పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను వేగవంతం చేయాలని వారికి సూచించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి శ్రావణ్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు

- జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్

మంథని, మే 9: రేషన్ బియ్యం పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్ తెలిపారు. మండలంలోని రేషన్ దుకాణాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందితో కలిసి గురువారం జిల్లా పౌర సరఫరాల శాఖ ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంథనిలో రేషన్ షాప్ నంబర్ 21 డిని తనిఖీ చేసినప్పుడు 82.47 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఎక్కువగా రేషన్ షాప్ నిల్వలలో గుర్తించడం జరిగిందని, సదరు డీలర్ ఈ రేషన్ బియ్యాన్ని నల్ల బజారుకు పంపే ఉద్దేశంతో పక్కనే ఉన్న గదిలో దాచిపెట్టగా తనిఖీలలో ఈ విషయం బయటపడిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజా పంపిణీ వ్యవస్థ నియంత్రణ ఉత్తర్వులు 2016 ప్రకారం సదరు రేషన్ డీలర్‌పై కేసు రిజిస్టర్ చేయబడిందని, ఎవరైనా రేషన్ డీలర్లు అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని మార్చేందుకే 'ఇస్ బార్ చార్ సౌ' నినాదం

- రిజర్వేషన్లను కాపాడుకోవాలంటే బీజేపీని ఓడించాలి - కాంగ్రెస్ పరిశ్రమలు పెడితే బీజేపీ అమ్ముకుంటోంది
- రామగుండం నుంచి మణుగూరు వరకు ఇండస్ట్రియల్ కారిడార్ - విలేకరుల సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

గోదావరిఖని, మే 9: బీజేపీ 'ఇస్ బార్ చార్‌సౌ' నినాదంతో ఎన్నికలకు వస్తుందని, పూర్తిస్థాయి మెజార్టీ సాధించడం ద్వారా రాజ్యాంగాన్ని మార్చడమే ఈ నినాదం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యమని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. గురువారం ఒక ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. 2000సంవత్సరంలోనే బీజేపీ నాయకులు రాజ్యాంగాన్ని తిరిగి రచిస్తామన్నారని, రాజ్యాంగాన్ని మార్చడం ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు లేకుండా చేయడమే బీజేపీ ఎజెండా అని శ్రీధర్‌బాబు ఆరోపించారు. ఈ ఎన్నికల్లో ప్రజలు అప్రమత్తతో ఉండాలని, రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు బీజేపీని ఓడించి కాంగ్రెస్‌ను ఆదరించాలని కోరారు. ప్రధాన మంత్రి మోదీ ఏది పడితే అది మాట్లాడుతున్నారని, రాష్ట్రంలో ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని అభాండాలు మోపుతున్నాడని, బీజేపీనే దేశ వ్యాప్తంగా ఎంఅండ్ఏ ట్యాక్స్ వసూలు చేస్తోందన్నారు. రాహుల్ గాంధీకి అదాని, అంబానీల నుంచి ట్రక్కుల ద్వారా నిధులు అందుతున్నాయని ప్రధాని మోదీ ఆరోపిస్తున్నాడని, మోదీ దగ్గరే కేంద్ర ప్రభుత్వం ఉంది, వ్యవస్థలు ఉన్నాయని, అవన్నీ పనిచేయడం లేదా అని ప్రశ్నించారు. వనరుల్లో అందరికి భాగస్వామ్యం కల్పించాలని, లెవల్ ప్లేయింగ్ ఫీల్డ్ తయారుచేయాలన్నదే రాహుల్ గాంధీ సంకల్పమన్నారు. దేశ సంపద కొందరి చేతుల్లో ఉండవద్దని కాంగ్రెస్ పార్టీ పేర్కొంటున్నదన్నారు. దేశ సంపదను లూటీ చేసిన లలిత్‌మోదీని దేశాన్ని దాటించారని, నీరవ్ మోదీలకు పూర్తిస్థాయిలో రుణాలు మాఫీ చేశారన్నారు. రాహుల్ నీతివంతమైన నాయకుడని, స్వాతంత్ర్యానికి ముందే యూపీ, ఢిల్లీలో ఆగర్భశ్రీమంతుల కుటుంబం అన్నారు. రాహుల్ కుటుంబం దేశం కోసం త్యాగాలు చేసిందని, ఆయనకు ఉండటానికి ఇల్లు కూడా లేదన్నారు. ప్రధాని వాఖ్యలు ఉల్టా చోర్ కొత్వాల్ కో దాంటే అనే రీతిలో ఉన్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ వివిధ రాష్ట్రాల్లో ప్రభుత్వరంగ సంస్థలను ఏర్పాటు చేసి కోట్లాది మందికి ఉపాధిని ఇచ్చిందని, బీజేపీ పదేళ్ల పాలనలో ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముకున్నదన్నారు. టూత్‌పేస్ట్ నుంచి పిల్లలు వాడే పెన్సిళ్ల వరకు జీఎస్టీ వసూళ్లు చేస్తుందన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు తగ్గినా కూడా దేశంలో డీజిల్, పెట్రోల్, గ్యాస్ సిలిండర్ల ధరలు పెంచారన్నారు. ఏటా రెండు కోట్ల మందికి ఉద్యోగాలు ఇస్తామని చెప్పి కేవలం 7లక్షల మందికి మాత్రమే ఇచ్చారన్నారు. వ్యవస్థను దుర్వినియోగపరిచారన్నారు. బీజేపీ ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతోందని ప్రశ్నించారు. కేంద్రంలో కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఏడాది పాటు మొదటి ఉద్యోగం వచ్చే వరకు యువతకు రూ.లక్ష యువ న్యాయం కింద అందిస్తామన్నారు. కోల్‌బెల్ట్‌లో రామగుండం నుంచి మణుగూరు వరకు ఇండస్ట్రియల్ కారిడార్‌ను ఏర్పాటు చేస్తామని, సింగరేణి, ఆర్ఎఫ్‌సీఎల్, ఎన్టీపీసీ సంస్థల్లో వాడే విడి భాగాలు, సామాగ్రిని ఉత్పత్తి చేసి సరఫరా చేస్తామన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పాలసీలో కొత్త ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటు చేస్తామని శ్రీధర్ హామి ఇచ్చారు. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ మాట్లాడుతూ రిజర్వేషన్ వ్యవస్థను కాపాడుకోవాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు. రామగుండంకు రూ.250కోట్ల నిధులు ఇవ్వడంతో పాటు విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు కూడా ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో వంశీకృష్ణను భారీ మెజార్టీ గెలిపించాలని వారు కోరారు.

ఈ విలేకరుల సమావేశంలో కనీసన వేతనాల బోర్డు చైర్మన్ జనక్‌ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు లింగస్వామి, మహంకాళి స్వామి, బొంతల రాజేష్, పాతిపెల్లి ఎల్లయ్య, పెద్దెల్లి ప్రకాష్, గట్ల రమేష్, తిప్పారపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరికలు

గోదావరిఖని, మే 9: గోదావరిఖని రెడ్డి సంఘం ఆధ్వర్యంలో సంఘం నాయకులు, సభ్యులు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. స్థానిక రెడ్డి సంఘం హాల్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌లు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మంథని మున్సిపల్ చైర్మన్ పెళ్లి రమారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొలని కవిత, నాయకులు ముకుందరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీదేవిరెడ్డి, సంతోష్‌రెడ్డి, నిర్మలారెడ్డి, జానకిరెడ్డి, సిద్ధార్థరెడ్డి పాల్గొన్నారు.

ఎన్టీపీసీ ఏరియాలో కేంద్ర బలగాల కవాతు



ఎన్టీపీసీలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు

జ్యోతినగర్, మే 9 : పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో గురువారం కేంద్ర బలగాలతో కలిసి స్థానిక పోలీసులు ఎన్టీపీసీ ఏరియాలో కవాతు నిర్వహించారు. గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ ఆధ్వర్యంలో రామగుండం సీఐ అజయ్‌బాబు, ఎన్టీపీసీ, రామగుండం ఎస్ఐలు ఉదయ్ కిరణ్, సతీష్ స్థానిక పోలీసులు, కేంద్ర బలగాలు సంయుక్తంగా మేడిపల్లి సెంరు నుంచి ఎన్టీపీసీ టీటీఎస్ ఆర్‌టీఏ కార్యాలయం వరకు కవాతు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ రమేష్ మాటాడుతూ పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరగడంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఎవరైనా ఎన్నికల కోడ్‌ను అతిక్రమించినా చట్ట వ్యతిరేఖ పనులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టామని తెలిపారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పెద్దపల్లి రూరల్, మే 9 : వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యువజన, క్రీడా శాఖ అధికారి ఏ.సురేష్ తెలిపారు. గురువారం పెద్దపల్లి మండలం రాఘవపూర్‌లో కోచ్ వి.సురేందర్ శిక్షణలో నిర్వహించబడుతున్న హ్యాండ్ బాల్ శిక్షణా క్యాంప్‌ను వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి ఏ.సురేష్ సందర్శించి శిక్షణ శిబిరాల నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఏ.సురేష్ మాట్లాడుతూ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణా శిబిరాన్ని విద్యార్థిని, విద్యార్థులు సద్వినియోగం చేసుకొని క్రీడల్లో రాణించాలని, క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. ఈ శిక్షణా శిబిరంలో విద్యార్థినీ, విద్యార్థులు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తా..

- పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ



రోడ్ షోలో మాట్లాడుతున్న వంశీకృష్ణ

ధర్మారం, మే9: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనకు కృషి చేస్తానని పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ అన్నారు. గురువారం రాత్రి మండల కేంద్రంలో జరిగిన రోడ్ షోలో మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ఆయన పాల్గొని ప్రసంగించారు. పదేళ్ల బీజేపీ, బీఆర్ఎస్ పరిపాలనలో పేద ప్రజలకు చేసిందేమి లేదన్నారు. తమ ట్రస్టు ద్వారా నిరుద్యోగ యువకులకు ఉపాధి కల్పించేందుకు సైతం కృషి చేస్తానని తెలిపారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పేద ప్రజలకు ఉపయోగపడే పథకాలను అమలుచేయలేదని దుయ్యబట్టారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనలో ఏ ఒక్కరికి న్యాయం జరగలేదన్నారు. కాంట్రాక్టర్‌ల కోసం కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించారని ఆయన ఆరోపించారు. పెద్దపల్లి ఎంపీగా గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ రోడ్ షోలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నమ్మించి నగదు దోచుకున్న ఇద్దరి అరెస్టు

లక్షెట్టిపేటరూరల్, మే 9: పాత కొమ్ముగూడెం గ్రామానికి చెందిన కున్నారపు లచ్చవ్వ అనే మహిళకు మాయమాటలు చెప్పి డబ్బులు కాజేసిన ఇద్దరు నిందితులను గురువారం కోర్టులో హాజరు పర్చినట్లు సీఐ నరేందర్, ఎస్ఐ చంద్రకుమార్ తెలిపారు. లచ్చవ్వ గ్రామంలో ఇంటి నిర్మాణం చేపడుతోంది. కరీంనగర్ జిల్లా వీణవంకకు చెందిన శివరాత్రి సదయ్య, పెద్దపల్లి మండలం తుర్కల మద్ది కుంటకు చెందిన గాదాసు రాజయ్యలు ఈ నెల 7న లచ్చవ్వ భర్త బయ టకు వెళ్లడం గమనించి ఇంటి నిర్మాణ పనులకు సిమెంటు, ఇటుక పంపి స్తున్నామని, రూ.25 వేలు ఇవ్వామన్నాడని చెప్పారు. లచ్చవ్వ రూ.24 వేలు ఇవ్వగా అక్కడ నుంచి వెళ్లిపోయారు. భర్త ఇంటికి వచ్చిన తర్వాత తాను ఎవర్ని పంపలేదని చెప్పడంతో మోసపో యానని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం స్థానిక కరీంనగర్ చౌరస్తాలో పోలీసులు వాహనాన్ని చూసి పారిపోతుండగా పట్టుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారన్నారు. నింది తుల నుంచి రూ. 23 వేల నగదు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ చంద్రకుమార్

వడదెబ్బతో ఉపాధిహామీ కూలీ మృతి

కాల్వశ్రీరాంపూర్, మే 9: పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని మీర్జంపేట గ్రామానికి చెందిన తిప్పని వెంకటలక్ష్మి(56) గురువారం గ్రామంలో ఉపాధిహామీ పనులు చేస్తూ వడదెబ్బకు గురైంది. పనిచేసే చోటనే అస్వస్థకు గురికాగా వెంకటలక్ష్మిని కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ మృతి

కోరుట్ల, మే 9: పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతానికి చెందిన బొగడమీది గౌరీ (32) అనే మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు గురువారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అశోక్-గౌరీ దంపతులు కూలీ పనులు చేస్తూ అల్లమయ్య గుట్ట ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. బుధవారం సాయంత్రం ఇంటికి వచ్చిన అశోక్ తన వెంట మటన్ తీసుకురాగా వంట విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. తీవ్ర మనస్తాపంతో జీవితంపై విరక్తి చెంది యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన అశోక్ చుట్టు ప్రక్కల వారి సహకారంతో గౌరీని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు గౌరీని మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించినట్లు తెలిపారు. కరీంనగర్‌లో చికిత్స పొందుతూ గౌరీ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గౌరీ సోదరుడు నగేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గౌరీకి ఇద్దరు మగపిల్లలు ఉన్నారు.

ఇందిరమ్మ కాలనీలో కార్డన్‌సెర్చ్


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

తంగళ్లపల్లి, మే 9: తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో పోలీసులు గురువారం రాత్రి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కాలనీలోని ప్రతీ ఇంటిని సోదా చేశారు. కొత్త వ్యక్తుల సమాచారాన్ని సేకరించారు. వాహనాల రిజిస్ట్రేషన్ తదితర అంశాలను పరిశీలించారు. తనిఖీల్లో ఎస్సై సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

వస్త్ర వ్యాపారులు, ఆసాములకు బెదిరింపులు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, మే 9: కాంగ్రెస్ నాయకులు కొందరు వస్త్ర వ్యాపారులను, ఆసాములను బెదిరింపులకు గురి చేస్తున్నారని, బలవంతంగా స్టేట్‌మెంట్స్ ఇప్పిస్తున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. గురువారం సిరిసిల్ల బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అబద్ధాలు చెప్పి గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తానని బోగస్ ముచ్చట చెప్పాడన్నారు. ఐదు సంవత్సరాలలో ఏ పల్లె ఎరగని బండి సంజయ్ తెల్లారితే మోదీ, రాముడు, మతం పేరిట గెలవాలని చూస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రూ. 50 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. వస్త్ర పరిశ్రమపై ప్రేమ ఉంటే వెంటనే బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల లోపు వస్త్ర పరిశ్రమకు, వ్యాపారులకు, ఆసాములకు, కార్మికులకు తీపి కబురు చెప్పాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సాయంత్రం కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ గెలుపు కోసం ప్రచారంలో భాగంగా సిరిసిల్లకు వస్తున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బస్సు యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, ఉపాధ్యక్షుడు ఎండీ సత్తార్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి ఆటో బోల్తా
ఐదుగురికి గాయాలు

ధర్మారం, మే9: ధర్మారం మండల కేంద్రంలోని ధర్మారం-పెద్దపల్లి రహదారిపై ఓ ప్రైవేట్ పాఠశాల సమీపంలో గురువారం రాత్రి అదుపు తప్పి ఆటో బోల్తా పడిన ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. ఇందులో ముగ్గురికి తీవ్ర గాయాలు గాయాలు కాగా ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. గురువారం రాత్రి ధర్మారంలో జరిగిన మంత్రి శ్రీధర్ బాబు రోడ్ షోకు గోపాల్‌రావుపేట గ్రామం నుంచి 8మంది వచ్చారు. తిరి గి ఆటోలో గోపాల్‌రావుపేటకు వెళ్తుండగా ఓ ప్రైవేట్ పాఠశాల సమీపంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జంగిలి బక్కయ్య, అందె తులశమ్మ, ఆటో డ్రైవర్ పోతు లచ్చయ్యలకు తీవ్ర గాయాలు కాగా శనిగారపు రాజమ్మ, బింగి మల్లమ్మలకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స కోసం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పగలు వ్యాపారం.. రాత్రిపూట దొంగతనాలు
- ఘరానా దొంగను అరెస్టు చేసిన పోలీసులు

కుకునూరుపల్లి, మే 9: పగటిపూట బట్టలు అమ్ముతూ, రాత్రిపూట దొంగతనాలకు పాల్పడుతున్న ఘరానా దొంగను కుకునూరుపల్లి పోలీసులు పట్టుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం రెడ్డి, సీఐ లతీఫ్‌తో కలిసి గురువారం విలేకరుల సమావేశంలో అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి వివరాలను వెల్లడించారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం బర్కత్పుర కాలనీకి చెందిన షేక్ సలీం(53) ఊరూరు తిరుగుతూ బట్టలు అమ్ముతుంటాడు. సలీంకు వచ్చే డబ్బు సరిపోకపోవడంతో రాత్రిపూట దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. సంవత్సర కాలంగా గ్రామాలు, పట్టణాలలో తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుంటున్నాడు. ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాల్లో ఉన్న నగదును ఎత్తుకెళ్లేవాడు. కుకునూరుపల్లి బస్టాండ్ ఆవరణలో బుధవారం రాత్రి అనుమానాస్పదంగా కనిపిస్తూ ఉన్న సలీంను పోలీసులు పట్టుకొని విచారించగా సంవత్సర కాలంగా రాత్రిపూట దొంగతనాలు చేస్తున్నారని ఒప్పుకున్నాడు. సిద్దిపేట, చేర్యాల పట్టణాల్లో, వంటిమామిడి, కొడకండ్ల, నారాయణరావుపేట్ గ్రామాల్లో దొంగతనాలకు పాల్పడ్డాడు. భారీ మొత్తంలో బంగారం, నగదును దొంగిలించాడు. కేసులో కీలకంగా వ్యవహరించిన సీఐ లతీఫ్, ఎస్సై శ్రీనివాస్, క్రైమ్ పార్టీ సిబ్బంది రమేశ్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

ఈదురు గాలులు.. వర్షం

- తడిసి ముద్దయిన ధాన్యం
- లేచిపోయిన ఇళ్ల పై కప్పు రేకులు
- అన్నదాతల అవస్థలు
- కొనుగోళ్లు వేగవంతం చేయాలని వినతి



కొనుగోలు కేంద్రంలో నిలిచిన వర్షం నీరు

కథలాపూర్, మే 9: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గురువారం ఈదురు గాలులు.. వర్షం కురిసింది. కథలాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం కురిసిన వడగళ్లు, ఈదురుగాలులు, భారీ వర్షం బీభత్సం సృష్టించాయి. కలికోట, అంబారిపేట, ఇప్పపల్లి, పోతారం గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిచి ముద్దయింది. రైతులు ధాన్యం ఆరబెట్టుకోగా అనూహ్యంగా కురిసిన వర్షం వల్ల పూర్తిగా ధాన్యం తడిచిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తూకం వేసిన ధాన్యం సంచులు తడిచిపోవడంతో మొలకలెత్తే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట వర్షార్పణం కావడం కారణంగా తీవ్ర నష్టం వాటిల్లిందని పేర్కొం టున్నారు. అదేవిధంగా పెగ్గెర్ల, ఊట్‌పల్లి గ్రామాల్లో ఈదురు గాలులకు ఇళ్లపై ఉన్న రేకులు ఎగిరి పడ్డాయి. ధాన్యం వద్ద నీళ్లు నిలవగా రైతులు మరో చోటికి తరలించుకుంటున్నారు.

బీర్‌పూర్: మండలంలో గురువారం మధ్యాహ్నం ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. 15 నిమిషాల పాటుగా కుండపోతగా కురిసింది. ఆకస్మాత్తుగా కురిసిన వర్షం కారణంగా బీర్‌పూర్‌లోని రెండు కొనుగోలు కేంద్రాలలో, తుంగూర్‌లోని కొనుగోలు కేంద్రంలో, కొల్వాయిలోని కొనుగోలు కేంద్రంలో, కండ్లపెల్లిలోని కొనుగోలు కేంద్రంలో, చెర్లపెల్లి, నర్సింహులపల్లి కొనుగోలు కేంద్రాలలో ఉన్నా వరి ధన్యం రాసులు తడిసిపోయాయి. ఒక్కసారి వర్షం రావడంతో రైతులు ధాన్యంపై కవర్లు వేయలేక పోయారు.

రుద్రంగి: రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామంలో సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. ఆలాగే రుద్రంగి మండల కేంద్రంలో కురిసిన వర్షనికి ధాన్యం తడిసి ముద్దయిదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మ్యాచర్ వచ్చి చాలా రోజులు గడుస్తున్నా ధాన్యం తూకం వేయడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చెస్తున్నారు. తడిసిన ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు.



మానాలలో కురిసిన వడగండ్లు



రుద్రంగిలో తడిసిన ధాన్యం



పెగ్గెర్లలో ఎగిరిపడ్డ రేకులు



బీర్‌పూర్‌లో కురుస్తున్న వర్షం

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, మే 9: ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్‌కు చెందిన గడ్డి రమేష్ అదృశ్యంపై కేసు నమోదు చేశామని పోలీసులు గురువారం తెలిపారు. తిమ్మాపూర్‌కు చెందిన రమేష్ భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఈ నెల 7న పనులు ముగించుకొని ఇంటికి చేరుకున్న రమేష్ అదే రోజు రాత్రి కుటుంబ సభ్యులకు చెప్పకుండా బయటకు వెళ్లాడు. చీకటి పడిన ఇంటికి రాకపోవడంతో రమేష్ భార్య స్వప్న పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా.. యువకుడు మృతి

జూలపల్లి, మే 9: మండలంలోని కాచాపూర్ గ్రామంలో గురువారం పుట్ట ప్రశాంత్(32) ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో మృతిచెందినట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. ట్రాక్టర్ నడుపుకుంటూ కటుంబాన్ని పోషించుకుంటున్న ప్రశాంత్ ఊరచెరువు సమీపంలో కల్వర్టు వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడడంతో దాని కిందపడి మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఓటర్లను ప్రలోభాలకు గురి చేసిన ఐదుగురిపై కేసు

హుజూరాబాద్, మే 9: కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణంలోని కోర్టు సమీపంలో గల ఓ ఫంక్షన్ హాల్‌లో ఆర్ఎంపీ వైద్యులకు విందు ఇచ్చి ఓటర్లను ప్రలోభాలకు గురి చేసినందుకు ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఆర్ రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం ఐదుగురి రాజకీయ నాయకులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇందులో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎమ్మెల్సీ నారాదాసు లక్ష్మణ్‌రావు, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, వి రవీందర్‌రావు ఉన్నారు. ఈ కేసులో మరో 20మంది ఉన్నారనిఈ మేరకు విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా బుధవారం రాత్రి ఆర్ఎంపీ వైద్యులకు ఓ రాజకీయ పార్టీకి చెందిన నాయకులు విందు ఇవ్వగా కాంగ్రెస్ నాయకులు జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశాదరు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు దాడులు చేసి విచారణ చేపట్టారు.

మూడు సెల్‌ఫోన్లు చోరీ

హుజూరాబాద్, మే 9: హుజూరాబాద్ పట్టణంలో గురువారం వారసంతలో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. బొప్ప రాజేందర్ అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు, చెడమావి కృష్ణమూర్తితో పాటు మరొకరు కూరగాయల కోసం మార్కెట్‌కు వచ్చి కూరగాయలు కొనుగోలు చేస్తున్నాడు. ఈ క్రమంలోనే జేబులో ఉన్న సెల్‌ఫోన్లు మాయమయ్యాయి. దీంతో బాధితులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కాగా గతంలో కూడా ఇదే వారసంతలో చాలా సెల్‌ఫోన్లను దొంగతనం చేశారు. పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఆరుగురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, మే 9: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో పట్టుబడిన ఆరుగురు వ్యక్తులకు జైలు శిక్ష పడిందని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలలో పట్టుబడిన 25 మంది వాహనదారులను గురువారం కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా ఒక వ్యక్తికి 10 రోజులు, మరొకరికి 7 రోజులు, ఇంకొకరికి 5 రోజులు, ముగ్గురు వ్యక్తులకు 3 రోజుల జైలు శిక్ష, మొత్తం 12,500 రూపాయల జరిమానాను జడ్జి విధించారని సీఐ తెలిపారు. మిగతా 19 మంది వాహనదారులకు 32వేల రూపాయల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

పోలీసు తనిఖీల్లో నగదు పట్టివేత

కరీంనగర్ క్రైం, మే 9: కరీంనగర్‌లో గురువారం నిర్వహించిన వాహన తనిఖీల్లో వేరు వేరు ఘటనల్లో సరైన ఆధారాలు లేని మొత్తం 12 లక్షల 56 వేల 3 వందల రూపాయల నగదు పట్టుబడింది. ఎన్నికల కోడ్ అమలులో భాగంగా అక్రమ డబ్బు, మద్యం సరఫరా అరికట్టేందుకు కరీంనగర్‌లోని పలుచోట్ల వాహనాల తనిఖీలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. కరీంనగర్ ఒకటో ఠాణా పరిధిలోని రాజీవ్‌చౌక్‌లో నిర్వహించిన వాహనాల తనిఖీలో అశోక్‌నగర్‌కు చెందిన నార్ల నరేష్‌కుమార్ వద్ద లక్షా 60 వేలు, కమాన్‌రోడ్‌కు చెందిన విజయరాఘవన్ విబిన్ వద్ద 2 లక్షల 40 వేలు రూపాయలు పట్టుబడ్డాయి. ఈ నగదును సీజ్ చేసి తదుపరి ప్రక్రియ కోసం సంబంధిత అధికారులకు స్వాధీనం చేశామని సీఐ సరిలాల్ తెలిపారు. అలాగే మూడో ఠాణా పరిధిలోని కాపువాడ చౌరస్తా వద్ద నిర్వహించిన వాహనాల తఖీల్లో బహదూర్‌ఖాన్ పేటకు చెందిన టి సంజీవ్ వద్ద 3 లక్షల 76 వేల 300 రూపాయల నగదు, నాకా చౌరస్తా వద్ద నిర్వహించిన వాహనాల తనిఖీల్లో కిసాన్‌నగ ర్‌కు చెందిన జె రమేష్ వద్ద 2 లక్షల 5 వేల రూపాయలు, కోర్టు చౌరస్తా వద్ద విద్యానగర్‌కు చెందిన పోలోజు నందం వద్ద లక్షా 75 వేలు, వావిలాలపల్లికి చెందిన జె శ్రీనివాస్ వద్ద లక్ష రూపాయల నగదు పట్టుబడిందని, ఈ నగ దును సీజ్ చేసి సంబం ధిత ఎన్నికల విభాగం అధికారులకు స్వాధీనం చేశామని సీఐ జాన్‌రెడ్డి తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న వెండి వస్తువులు



పట్టుబడిన నగదును చూపుతున్న సీఐ సరిలాల్

- నగదు, వెండి వస్తువులు స్వాధీనం

కరీంనగర్‌లోని కోర్టుచౌరస్తా వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో గంగాధర మండలం ఘర్షకుర్తి గ్రామానికి చెందిన కట్ట శ్రీనివాసచారి వద్ద సరైన ఆధారాలులేని 4 లక్షల 36 వేల 300 రూపాయల నగదును పట్టుకున్నారు. అలాగే గుంటూరు జిల్లా తెనాలి మండలం, నెలపాడు గ్రామానికి చెందిన నల్లబోతుల గొప్ప రాజు వద్ద దాదాపు 3 లక్షల విలువైన 4 కిలోల వెండి వస్తువులు బహుమతులను పట్టుకున్నట్లు రెండో ఠాణా సీఐ సీఐ విజయ్ కుమార్ తెలిపారు. పట్టుబడిన నగదు, వెండి బహుమతులను తదుప రి ప్రక్రియకు సంబంధిత అధికారుల వద్దకు తరలించామని తెలిపారు.

జగిత్యాలలో తనిఖీలు

జగిత్యాల టౌన్, మే 9 : జగిత్యాల జిల్లా కేంద్రంలో గురువారం రాత్రి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, మంచినీళ్ల బావి, బైపాస్ రోడ్, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తుల వద్ద రూ. 13.5 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి పత్రాలు లేని వాహనాలు పట్టుకుని జరిమానాలు విధించారు.

కొండగట్టులో యువకుడి ఆత్మహత్య

మల్యాల, మే 9: కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం రేకుర్తికి చెందిన సిరిగిరి సమ్మయ్య(37)అనే వ్యక్తి దిగువ కొండగట్టులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గతంలో జరిగిన రైలు ప్రమాదంలో కుడి కాలు, చేతి కోల్పోవడంతో తీవ్ర మనస్తాపంతో ఉన్న సమ్మయ్య కుటుంబపోషణకు గాను పని చేయడానికి వారం రోజుల క్రితం కొండగట్టు వచ్చాడు. అయితే గురువారం ఓ హోటల్ ముందు మృతి చెంది ఉండడంతో స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. దీంతో కుటుంబసభ్యులు వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. సమ్మయ్య భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపారు

ఏకలవ్య గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డిపేట, మే 8: ఉమ్మడి జిల్లాలోని గిరిజన ఏకలవ్య గురుకుల కళాశాలల్లో ప్రవేశాల కోసం 2023-2024 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని గురుకులాల ఆర్‌సీవో డీఎస్. వెంకన్న గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట(బాలికలు), మరిమడ్ల(బాలురు) కళాశాలల్లో సీబీఎస్ఈ సిలబస్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ విభాగాల్లో ప్రవేశాల కోసం ఈ నెల 9 నుంచి 21వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు పదో తరగతి మార్కుల ప్రతిభ ఆధారంగా ఈ నెల 24న ఉదయం 9 గంటల నుంచి ఎల్లారెడ్డిపేటలోని ఏకలవ్య గురుకులంలో కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు.



విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

ప్రారంభమైన ఎప్‌సెట్

- జిల్లా వ్యాప్తంగా 9 కేంద్రాల ఏర్పాటు

తిమ్మాపూర్, మే 9: ఇంజనీరింగ్ ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ ప్రవేశ పరీక్షలు గురువారం ప్రారంభం అయ్యాయి. ఈ పరీక్షలు శుక్రవారం, శనివారం కూడా కొనసాగనున్నాయి. ఈ పరీక్షలకు గురువారం కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. రెండు సెషన్‌లలో జరిగిన ఈ పరీక్షకు ఉదయం 9 గంటల నుంచి జరిగిన మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన మొదటి సెషన్‌లో 9 పరీక్ష కేంద్రాలలో కలిపి 2,449 మందికి 2393 మంది విద్యార్థులు హాజరయ్యారు. కాగా 56 మంది హాజరుకాలేదు. మధ్యాహ్నం 3గంటల నుంచి 6 గంటల వరకు జరిగిన రెండవ సెషన్‌లో 2,450 మందికి 2395 మంది విద్యార్థులు హాజరయ్యారు. కాగా 55 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదని నిర్వాహకులు తెలిపారు. పరీక్ష సమయానికి గంటన్నర ముందు నుంచే విద్యార్థులనుఅనుమతించారు.

కొనుగోలు కేంద్రాలకు స్థలాల కొరత

- రోడ్ల పైనే ధాన్యం కుప్పలు
- ప్రమాదమని తెలిసినా రైతన్నకు తప్పని దుస్థితి

పెగడపల్లి, మే 9: ధాన్యం కొనుగోలు కేంద్రాలకు శాశ్వత స్థలాలు లేక ఆరుగాలం శ్రమించి ధాన్యం పండించిన రైతన్నలు ఇబ్బందులు పడుతున్నారు. పెగడపల్లి మండలంలోని 23 గ్రామాలు ఆయకట్టు పరిధిలోని ఉన్నాయి. మండలంలోని 90 శాతానికి పైగా భూములలో వరి పంటనే సాగు చేస్తారు. పండించిన ధాన్యాన్ని విక్రయించుకునేందుకు మండలంలోని పెగడపల్లి, నంచర్ల, నందగిరి సహకార సంఘాలతో పాటు సెర్ప్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల చేత ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోళ్లు చేస్తున్నారు. ఆయా గ్రామాలలోనే రైతులకు అందుబాటులోనే కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేస్తున్నప్పటికి వాటికి సరైన స్థలాలు లేక ప్రధాన రహదారులైన తారు రోడ్లకు ఇరువైపులా ధాన్యం కుప్పలు పోసి తూకం వేయించుకోవాల్సిన పరిస్థితులు అన్ని గ్రామాలలోని కొనుగోలు కేంద్రాలలో ఉంది. దీనికి తోడు గుట్ట బోర్లకు, పంట పొలాలలో కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఎగుడు దిగుడు భూములలో ధాన్యం పోసి చిన్న పాటి వర్షం వచ్చినా ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. గుట్టబోర్ల పైన ఏర్పాటు చేసిన కేంద్రాలలో ఏ కొద్ది వర్షం పడినా ధాన్యం కొట్టుకు పోతుండగా , పంట పొలాలలో ఏర్పాటు చేసి కేంద్రాలలో వర్షాలు కురిసినపుడు ధాన్యం కుప్పలు, తూకం వేసిన సంచులు తడిసిపోతున్నాయి. దీంతో తూకం వేయకపోవడం తడిసిన ధాన్యం పేరిట తరుగు తీయడంతో నష్టపోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. మండలంలో ప్రతి పంటకు 3.50 లక్షల నుంచి 4 లక్షల క్వింటాల్ల వరకు ధాన్యం తూకం వేస్తుండగా మండలంలోని 23 గ్రామాలలో ఎక్కడా కూడా శాశ్వత స్థలాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాలకు శాశ్వత స్థలాలు ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులకు అధికారులకు ప్రతి యేటా రైతులు మొరపెట్టుకుంటున్నా పట్టించుకునే నాథుడే లేడని వాపోతున్నారు. రైతుల శ్రేయస్సు గురించి మాట్లాడే ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాలకు శాశ్వత స్థలాలు చూపించి సిమెంట్ ప్లాట్‌ఫాంలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

శాశ్వత స్థలాలు కేటాయించాలి..

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అన్ని గ్రామాలలో ప్రభుత్వ స్థలాలను కేటాయించి శాశ్వత కేంద్రాలు ఏర్పాటు చేయాలి, ఎంతో కష్టపడి పండించిన ధాన్యం విక్రయించుకుందామంటే సరైన కేంద్రాలు లేక మట్టిలో, ఎగుడు దిగుడు స్థలాలలో ధాన్యం కుప్పలు పోసి ఇబ్బందులు పడుతున్నాం. పండించిన ధాన్యం మట్టిలో కలసిపోతోంది. కొనుగోలు కేంద్రాలలో సిమెంట్ ప్లాట్‌ఫాంలు ఏర్పాటు చేసి ధాన్యం మట్టిలో కలసి పోకుండా చూడాలి.

- ప్రశాంత్ రావు. పెగడపల్లి.



రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కుప్పలు

శంకర జయంతి ఉత్సవాలు ప్రారంభం



శంకరాచార్యుల వారి చిత్రపటం వద్ద పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ, మే 9: ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రీ శంకర జయంతి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం వేళలో ఆలయ అర్చకులు శ్రీ రాజరాజేశ్వర స్వామి వారికి స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతలకు అర్చనలు నిర్వహించారు. అనంతరం శ్రీ స్వామివారి అద్దాల మండపంలో శ్రీ శంకరాచార్యుల చిత్రపటానికి ఉపనిషత్ ద్వారాభిషేకం, పూజలు గావించారు. శంకర పారాయణం, ఆధ్యాత్మిక ప్రవచనం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఐదు రోజులపాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజు శ్రీ స్వామివార్లకు, శ్రీ శంకరాచార్యులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని ఆలయ అధికారులు తెలిపారు.

మహిళా ఖైదీల పిల్లలకు ఆశ్రయం కల్పించేందుకు కృషి



జైలును సందర్శించిన సీడబ్ల్యూసీ సభ్యులు

కరీంనగర్ క్రైం, మే 9: మహిళా ఖైదీలకు పిల్లలు ఉన్నట్లయితే వారికి విద్య, ఆశ్రయం, ఉపకార వేత నం అందించేందుకు కృషి చేస్తామని బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ ధనలక్ష్మి అన్నారు. జైలులో ఉన్న మహిళలకు సంబంధించిన పిల్లల రక్షణ, సంరక్షణ, విద్యా తదితర విషయాలను తెలుసుకునేందుకు కరీంనగర్ బాలల సంక్షేమ సమితి(సీడబ్ల్యూసీ) ప్రతినిధులు గురువారం కరీంనగర్ జైలు అధికారులతో కలిసి జైలులోని మహిళా విభాగం బారక్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా జైలులో ఉన్న మహిళఖైదీలతో మాట్లాడి ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. మహిళా ఖైదీలకు పిల్లలు ఉన్నట్లయితే వారికి చేయూతనందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జైలు అధికారులు రమేశ్, సంగీత, బాలల సంక్షేమ సమితి సభ్యులు రేండ్ల కళింగశేఖర్, విజయ్, రాధా, అర్చనరెడ్డి, జైలు అధికారులు పాల్గొన్నారు.

చేపల వేట కోసం అమర్చిన విద్యుత్ తీగలు తగిలి యువకుడి మృతి

- ఎల్లారెడ్డిపేట మండలం సింగారంలో ఘటన

ఎల్లారెడ్డిపేట, మే 9: ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామంలో చేపలను వేటాడేందుకు అమర్చిన విద్యుత్ తీగలు ముత్యాల బాలకృష్ణ (38) అనే యువకుడు గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కిషన్ అతడి స్నేహితులు పుటకుల్ల సుధీర్, బొమ్మడి శంకర్‌తో కలిసి చేపలు పట్టేందుకు గ్రామ శివారులోని మానేరు వాగులోని చెక్ డ్యాం వద్దకు వెళ్లారు. నీటిలో తీగలను అమర్చి వాటికి కరెంటు సరఫరా అయ్యేలా ఏర్పాటు చేసుకున్నారు. ప్రమాదవశాత్తు కిషన్ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆందోళనకు గురైన సుధీర్, శంకర్ అక్కడి నుంచి పారిపోయారు. అక్కడే ఉన్న వ్యక్తులు గమనించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో భార్య, పిల్లలు రోదనలు మిన్నంటాయి. సుధీర్, శంకర్‌లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని వివరించారు. మృతుడికి భార్య కావ్య, ఇద్దరు కూతుళ్లు సహస్ర, లాస్యప్రియ, కుమారుడు అఖిల్‌తేజ్ ఉన్నారు. గత యేడాది జూలై 2న అదే గ్రామానికి చెందిన బొమ్మడి నారాయణ చేపల వేటకు వెళ్లి కరెంటు షాక్‌తో మృతి చెందాడు. విద్యుత్తు తీగలు అమర్చి చేపలను వేటాడడంతో ప్రమాదవశాత్తు ప్రాణాలను కోల్పోతున్నారు. సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



హరీష్(ఫైల్)

పాలకుర్తి, మే 9: విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. బసంత్ నగర్‌కు చెందిన కొమ్ము హరీష్(24) సాయంత్రం ఒక్కసారిగా వచ్చిన అకాల వర్షానికి గోడలు తడిసి పైన ఉన్న బట్టలు ఆరవేసే దండానికి విద్యుత్ సరఫరా అయ్యింది. ఇది గమనించని హరీష్ చెయ్యి పైకి లేపడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. బంధువులు, స్నేహితులు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. అవివాహితుడైన హరీష్‌కు తల్లి, సోదరుడు ఉన్నారు. బసంత్‌నగర్ ఆలయ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిలో సహాయకుడిగా ఉద్యోగం చేస్తున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాపు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రిజర్వేషన్ల రద్దు ప్రచారం కుట్ర

- బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్



మాట్లాడుతున్న బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్

భగత్‌నగర్, మే 9: బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తారంటూ కాంగ్రెస్ ప్రచారం చేయడం వెనుక కుట్ర దాగి ఉందని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ అన్నారు. గురువారం కరీంనగర్‌లోని ఎంపీ కార్యాల యంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓట్లను కొల్లగొట్టేందుకు కాంగ్రెస్ ఆడుతున్న డ్రామాలో భాగమే అన్నారు. అంబేద్కర ప్రజాస్వామ్య దేశంలోని అనేక విషయాలను జోడించి ప్రపంచంలోనే ఆదర్శమైన రాజ్యాంగాన్ని రాశారన్నారు. దళితుడైన అంబేద్కర్‌ను కాంగ్రెస్ పార్టీ అవమానించిందన్నారు. ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్‌భగత్ మాట్లాడిన అంశాలను వక్రీకరిస్తున్నారని ఎస్.కుమార్ అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత

మల్యాల, మే 9: మండలంలోని నూకపల్లి డబుల్‌బెడ్ రూం ఇళ్ల వద్ద గుడుంబా అమ్ముతున్న నూకపల్లికి చెందిన సిలువేరి లక్ష్మి వద్ద మూడు లీటర్ల గుడుంబాను పట్టుకున్నట్లు ఎస్సై అబ్దుల్‌రహీం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మికి గుడుంబాను సరఫరా చేస్తున్న రాజరం గ్రామానికి చెందిన తిరుమలేష్‌తో పాటు లక్ష్మిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గుడుంబా తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటమని హెచ్చరించారు.

'ఉపాధి' కూలీలే టార్గెట్



- గ్రామాల్లో పనులు జరుగుతున్న ప్రదేశాలకు అభ్యర్థులు
- ఒకేచోట రెండు, మూడు వందల మంది కూలీలు
- పైసా ఖర్చులేకుండానే ఎన్నికల ప్రచారం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

వేసవికాలం కావడంతో తెల్లవారుజామున్నే గ్రామాల్లో చాలా మంది కూలీలు ఉపాధిహామీ పనులకు వెళుతున్నారు. గ్రామాల్లో ప్రచారం చేసేందుకు వెళుతున్న అభ్యర్థులు, వారి తరపున ప్రచారం చేసేందుకు వెళుతున్న ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఉపాధిహామీ పథకం పనులు జరుగుతున్న చోటికి వెళ్లి పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నారు. జిల్లాలో 1,17,820 కుటుంబాలకు ప్రభుత్వం ఉపాధిహామీ పనులకు వెళ్లేందుకు జాబ్ కార్డులను జారీచేసింది. ఈ కార్డుల్లో 2,41,987 మంది కూలీలు నమోదై ఉన్నారు. ఏప్రిల్ నుంచి గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు చాలా మంది కూలీలు వస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 30 వేల నుంచి 50 వేల మందికి పైగా కూలీలు పనులకు వెళుతున్నారు. బుధవారం 31,966 మంది కూలీలు ఉపాధి పనులకు హాజరయ్యారు. అభ్యర్థులు గ్రామాలకు వెళ్లి ప్రచారం చేయాలంటే వారి వెంట కనీసం 50నుంచి 200మంది అయినా ఉండేలా అభ్యర్థులు, నాయకులు చూసుకుంటారు. అందులో ఎక్కువగా మహిళలు ఉండే విధంగా చర్యలు తీసుకుంటారు. గ్రామంలో ప్రచారం ముగిసే వరకు వారి వెంట తిరిగినందుకు 100 నుంచి 200 రూపాయల వరకు కూలీ చెల్లిస్తారు. పార్లమెంట్ ఎన్నికలు వేసవిలో రావడంతో అభ్యర్థులు, వివిధ పార్టీల నాయకులు ప్రచారం నిర్వహించేందుకు తంటాలు పడుతున్నారు. అయినా గ్రామాలకు వెళ్లేసరికి రైతులు పొలాల వద్ద, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద, మహిళలు ఉపాధిహామీ పనులు జరిగే చోట ఉంటున్నారు. ప్రస్తుతం వరి కోతలు సాగుతున్నప్పటికీ, హార్వేస్టర్ల ద్వారానే వరి కోతలు చేపడుతున్నారు.

గతంలో కూలీల చేత వరి కోయించి కట్టలు కట్టి వాటిని కల్లం వద్దకు తీసుకవెళ్లేవారు. ఆ తర్వాత ట్రాక్టర్‌తో బంతి కొట్టించిన తర్వాత గడ్డి గుంజి వడ్లను తూర్పార పట్టేవారు. ఎకరం వరి కోసి వడ్లు తూర్పార బట్టే వరకు రెండు, మూడు రోజులు కావడంతో పాటు 20 మంది కూలీలు అవసరం ఉండేవారు. అప్పుడు గ్రామాల్లో ఉండే వ్యవసాయ కూలీలకు చేతినిండా పని దొరికేది. వరి కోత మిషన్లు వచ్చిన నాటినుంచి రైతులు వాటినే సద్వినియోగం చేసుకుంటున్నారు. దీంతో వ్యవసాయ కూలీలకు వ్యవసాయ పనులు దొరకడం లేదు. దీంతో మార్చి నుంచి వరినాట్లు ప్రారంభమయ్యే జూన్ మాసం వరకు కూలీలు ఉపాధిహామీ పనులకు వెళుతున్నారు.

● కొత్త ట్రెండ్‌గా..

ఎండలు ఎంత దంచికొడుతున్నా కూడా కూలీలు తెల్లవారగానే ఇంట్లో పనులు చేసుకుని 6 గంటలకల్లా ఉపాధిహామీ పనులకు వెళుతున్నారు. ఉదయం 11గంటల వరకు పనిచేసి ఇళ్లకు చేరుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామాలకు వెళుతున్న వివిధ పార్టీల అభ్యర్థులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు ఉపాధిహామీ పనులు జరుగుతున్న చోటకు వెళ్లి విస్తృత ప్రచారం చేస్తున్నారు. దీంతో ఇంటింటికి తిరిగి ప్రచారం చేసే అవసరం లేకపోవడంతో పాటు ఒకేచోట వంద నుంచి 200 మంది వరకు ఉండడంతో ప్రచారం చేయడం సులువుగా మారింది. అలాగే ప్రచార ఖర్చులు కూడా తగ్గుతున్నాయి. కొందరు అభ్యర్థులైతే చల్ల ప్యాకెట్లు తీసుకువెళ్లి కూలీలకు ఇస్తున్నారు. ఈ ఎన్నికల్లో గ్రామాల్లో అందరూ ఉపాధిహామీ కూలీల చుట్టే తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. ఓటర్లలో సగం మంది మహిళా ఓటర్లే ఉంటారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో పురుషులకంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. అందుకే వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు, నాయకులు మహిళలను కలిసి ప్రచారం చేస్తున్నారు. బహిరంగ సభలు, ర్యాలీలకు కూడా వారినే ఎక్కువగా పిలుస్తున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ఉండే మహిళలు ఉపాధిహామీ పనులకు వెళుతుండడంతో వారు పనిచేస్తున్న చోటికే వెళ్లి ప్రచారం చేస్తున్నారు. కేంద్రంలో తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఉపాధిహామీ పథకాన్ని తీసుకవచ్చారని చెబుతున్న కాంగ్రెస్ నాయకులు ఈసారి కేంద్రంలో అధికారంలోకి వస్తే కూలీని 400 రూపాయలకు పెంచుతామని హామీ ఇస్తున్నారు. అలాగే రాష్ట్రంలో అమలవుతున్న, అమలుచేయనున్న ఆరు గ్యారంటీ పథకాల గురించి ప్రచారం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ నాయకులు సైతం నిరంతరం కూలీలకు పనులు కల్పించే విధంగా తమ హయాంలో అనేక పనులను గుర్తించామని, ఎన్నో పనులు చేసి గ్రామాలను అభివృద్ధి చేశామని చెబుతున్నారు. బీజేపీ నాయకులు సైతం తమకే ఓటు వేయాలంటూ అభ్యర్థిస్తున్నారు. మొత్తంమీద అన్ని పార్టీల అభ్యర్థులు, నాయకులు ఉపాధిహామీ పనులు జరుగుతున్న చోటికి వెళ్లి ప్రచారం నిర్వహిస్తుండడం కొత్త ట్రెండ్‌గా మారింది.

'షాపులు కూల్చకుండా రక్షణ కల్పించండి'

గోదావరిఖని, మే 9: తమ షాపులు కూల్చకుండా ప్రభుత్వ అధికారులు, పోలీసులు రక్షణ కల్పించాలని స్థానిక అశోక్‌నగర్‌లోని ఓల్డ్ అశోక థియేటర్ పక్కనే ఉన్న షాపుల యజమానులు కోరారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో షాపుల యజమానులు పులిపాక రాజ్‌కుమార్, రాందాస్, అయాజ్, కొండపాక సత్యనారాయణ, ఆర్కే చారి మాట్లాడారు. 20కుటుంబాలు ఈ షాపులపై ఆధారపడి 50ఏళ్లుగా జీవనం సాగిస్తున్నాయన్నారు. 20ఏళ్ల క్రితం రోడ్డు వెడల్పు పేర తమ షాపులను 75శాతం మేర తొలగించారని, ఇప్పుడు మొత్తం తీసివేయాలంటూ కార్పొరేషన్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు చెబుతున్నారన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తమకు పట్టాలు కూడా ఇచ్చారని వారు పేర్కొన్నారు. ఎలాంటి ప్రత్యామ్నాయాలు చూపకుండా తమను ఖాళీ చేయాలనడం సరికాదన్నారు. ఇప్పటికే తాము కోర్టును ఆశ్రయించామని, హైకోర్టు స్టే మంజూరు చేసిందన్నారు. కొందరు తమ దుకాణాలను బలవంతంగా ఖాళీ చేయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం ఉందని, పోలీసులు, ప్రభుత్వ అధికారులు రక్షణ కల్పించాలని కోరారు.

'యాజమాన్యం నిర్లక్ష్యంతోనే ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో ప్రమాదాలు'

కోల్‌సిటీ, మే 9: ఆర్‌ఎఫ్‌సీఎల్ యాజమాన్యం నిర్లక్ష్యంతోనే పరిశ్రమలో వరుస ప్రమాదాలు జరుగుతున్నాయని ఫ్యాక్టరీస్ విభాగం, ఆర్‌ఎఫ్‌సీఎల్ సేఫ్టీ అధికారులు పట్టించుకోవడం లేదని కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకుడు అంబటి నరేష్ ఆరోపించారు. రెండు రోజుల క్రితం బొడ్డుపెల్లి నాగార్జున అనే కార్మికుడు ప్రమాదానికి గురై కాలుకు తీవ్రగాయమైనా యాజమాన్యం కానీ, కాంట్రాక్టర్ కానీ స్పందించలేదన్నారు. ప్రమాదాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రమాదాలను నివరించకపోతే ఫ్యాక్టరీస్ డిపార్ట్‌మెంట్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

'కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి'

పెద్దపల్లిటౌన్, మే 9: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తమ మద్దతు తెలుపుతున్నట్లు తెలంగాణ క్రిష్టియన్ కౌన్సిల్ అధ్యక్షులు ముల్కల ప్రవీణ్ పేర్కొన్నారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ క్రిష్టియన్ కౌన్సిల్, రాష్ట్ర క్రైస్తవ సంఘాల జెఏసి కాంగ్రెస్ అభ్యర్థులకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. సమావేశంలో తెలంగాణ క్రిష్టియన్ కౌన్సిల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సొడమల్ల సన్నీ ఏడ్వర్డ్ జిల్లా అధ్యక్షులు బుద్దుల రమేష్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆరెపల్లి మానస్ కుమార్, మాచర్ల అంజి, సీపీఐ పట్టణ కార్యదర్శి చంద్రగిరి ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్న నాయకులు

-ఎమ్మెల్యే విజయరమణారావు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిటౌన్, మే 9: కాంగ్రెస్ తీసకుంటున్న నిర్ణయాలు వాటి అమలును చూసి ఇతర పార్టీ నాయకులు ఆకర్షితులవుతున్నారని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పేర్కొన్నారు. స్థానిక ఆర్కే గార్డెన్లో గురువారం ఏర్పాటు చేసిన చేరికల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి పార్టీలో చేరుతున్నారన్నారు. ఈకార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు ఆడెపు సుధాకర్, వల్స నిలయ్యలతో పాటు పద్మశాలి సంఘం సభ్యులు 50 మందికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

ఓదెల, మే 9 : మండల కేంద్రంలో గురువారం ముదిరాజ్ సంఘం, గౌడ సంఘం నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ళ సుమన్‌రెడ్డి, చీకట్ల మొండయ్య, బోడకుంట శంకర్, చింతం కుమారస్వామి,ఆకుల మహేందర్ పాల్గొన్నారు.

స్థానిక అభ్యర్థిని గెలిపించాలి

పెద్దపల్లిటౌన్, మే 9: స్థానిక స్వతంత్ర అభ్యర్థి అయిన తనను గెలిపించాలని కట్కూరి సందీప్ కోరారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ యువ నాయకత్వాన్ని ప్రోత్సహించాలన్నారు. తనకు ఓటు వేసి గెలిపించాలి విజ్ఞప్తి చేశారు.

వంశీకృష్ణకు మద్దతుగా ప్రచారం

ధర్మారం, మే 9: పెద్దపల్లి ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ గెలుపునకు గురువారం మండల కేంద్రంలో నాయకులు ప్రచారం చేశారు. వంశీకృష్ణను ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు.

కాల్వశ్రీరాంపూర్‌లో..

కాల్వశ్రీరాంపూర్, మే 9: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీని ఎంపీగా గెలిపించాలని కోరుతూ మండలంలోని మల్యాలలో పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, మాజీ జడ్పీటీసీ లంక సదయ్య తదితరులు పాల్గొన్నారు.

ముత్తారంలో..

ముత్తారం, మే 9: మండలంలోని పారుపల్లి, శాత్రాజ్‌పల్లిలో ఉపాధిహామీ కూలీల వద్దకు పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని కోరుతూ మాజీ జడ్పీటీసీ నాగినేని జగన్మోహన్‌రావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ చొప్పరి సంపత్, నాయకులు ఏడవేన సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా ప్రచారం

ధర్మారం,మే9: పెద్దపల్లి ఎంపి బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ గెలుపు కోసం గురువారం ధర్మారం మండలంలో బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలంలోని కానంపల్లి, ఖిలావనపర్తి, నందిమేడారం గ్రామాల్లో నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. కారు గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ ఎన్నికల ప్రచారంలో మండల బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

ఓదెలలో..

ఓదెల, మే 9 : మండలంలోని గుండ్లపల్లి, కనగర్తి, మడక, శానగొండ, గుంపుల గ్రామాలల్లో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని కోరారు. జడ్పీటీసీ గంట రాములు, సింగిల్ విండో మాజీ చైర్మన్ ఆళ్ళ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పులుగు తిరుపతిరెడ్డి, వైస్‌ఎంపీపీ జీల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఎలిగేడులో..

ఎలిగేడు, మే 9 : మండలంలోని లాలపల్లి గ్రామంలో గురువారం పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ నాయకులు తానిపర్తి స్రవంతిమోహన్‌రావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి, న్యాతరి పోచయ్య, బసంపల్లి రాజేష్, బద్దం తిరుపతిరెడ్డి, కవ్వంపల్లి బాపయ్య పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ప్రచారం

పెద్దపల్లి రూరల్, మే 9 : మండలంలోని బొంపల్లి, గుర్రాంపల్లి గ్రామాల్లో ఎంపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్‌ను గెలిపించాలని బీజేపీ మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో గురువారం ప్రచారం నిర్వహించారు. దాడి సంతోష్, వేల్పుల రమేష్, పడాల శ్రీధర్ పాల్గొన్నారు.

జూలపల్లిలో..

జూలపల్లి, మే 9 : మండలకేంద్రంలో గురువారం బీజేపీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేష్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. లక్ష్మీనారాయణ, గుంటి సది, మెండె రాజన్న, ఆవుల రాజు పాల్గొన్నారు.

మోదీ పాలనలోనే అందరికీ న్యాయం

పెద్దపల్లిటౌన్, మే 9: కేంద్రంలో మోదీ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేకూరిందని ముత్తారం మండలం సింగిల్ విండో మాజీ డైరెక్టర్ నాగినేని జగదీశ్వరరావు పేర్కొన్నారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అందరికి సామాజిక న్యాయం పూర్తిస్థాయిలో అమలుపరిచే మోదీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ అభ్యర్థులను, పెద్దపల్లి నుంచి గోమాసే శ్రీనివాస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

'స్థాయికి మించి మాట్లాడడం సరికాదు'

కమాన్‌పూర్, మే 9 : అధికారం కోసం మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకులు స్థాయికి మించి మాట్లాడడం సరికాదని బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు అనిల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ జడ్పీటీసీ మేకల సంపత్‌యాదవ్, పొన్నం రాజేశ్వరి, నీలం సరిత, తాటికొండ శంకర్, కొండ వెంకటేష్ తదితరులు ఉన్నారు.

గాలికి కూలిపోయే బ్రిడ్జీలు, ప్రాజెక్టులు కట్టిన బీఆర్‌ఎస్ : మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, మే 9: గాలికి కూలిపోయే వంతెనలను, కృంగిపోయే ప్రాజెక్టులను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కట్టి ప్రజల సొమ్మును దుర్వినియోగం చేసిందని మంత్రి శ్రీధర్‌బాబు ఆరోపించారు. మున్సిపల్ పరిధిలోని శ్రీపాద కాలనీలో కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా శ్రీధర్‌బాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జరిగిన సమావేశంలో శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏడు లక్షల కోట్ల అప్పు తీసుకుందని, మంథని ప్రాంతానికి ఒక చుక్క నీరు కూడా ఇవ్వకుండా లక్ష కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టును కట్టారన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి ఖర్చు చేసిన లక్ష కోట్ల నిధులతో రాష్ట్ర వ్యాప్తంగా డబుల్ బెడ్ రూమ్‌ల నిర్మాణాలు చేపట్టవచ్చన్నారు. గాలి దుమారం వస్తే బ్రిడ్జిలు కూలిపోతాయాని ప్రశ్నించారు. పార్లమెంటు ఎన్నికల్లో గడ్డం వంశీని భారీ మెజార్టీతో ఎంపీగా గెలిపించాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి, ఎంపీపీ కొండ శంకర్, వైస్‌చైర్మన్ శ్రీపతి బానయ్య, నేతలు ఇనుముల సతీష్, శశిభూషణ్‌కాచే, వొడ్నాల శ్రీనివాస్, మూల సరోజన, పురుషోత్తంరెడ్డి, గోటికార్ కిషన్‌జీ, గుండా పాపారావు, విజయలక్ష్మి పాల్గొన్నారు

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 200 పని దినాలు

అంతర్గాం, మే 9: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఉపాధి హామి కూలీలకు 200రోజుల పనిదినాలు కల్పించడంతో పాటు కూలీ రేట్లు 200 నుంచి 400లకు పెంచనున్నట్లు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. గురువారం పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు మద్దతుగా అంతర్గాం మండలంలోని లింగాపూర్ ఉపాధి కూలీలను, ప్రజలను కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్‌కే ఇష్తాకార్ అహ్మద్, సింగం కిరణ్‌గౌడ్, అనుమాస శ్రీనివాస్, సిరిశెట్టి సతీష్‌గౌడ్, ఈదునూరి హరి ప్రసాద్, వెంకటేష్, రవి పాల్గొన్నారు. అదే విధంగా రామగుండం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అంతర్గాం మండల పరిధిలోని ఎగ్లాస్‌పూర్‌కు చెందిన మాజీ వార్డు సభ్యులు కాగ్రెస్ పార్టీలో చేరగా ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ బరుపటి తిరుపతి, గోర్క సంతోష్, లగిశెట్టి దేవేందర్, కట్కూరి లింగమూర్తి, గుమ్మడి శ్రావణ్, అలువాల రాజేష్, సతీష్ పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ కూటమిని ఓడించండి

అంతర్గాం, మే 9: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీ కూటమి అభ్యర్థులను ఓడించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు ఈదునూరి నరేష్ అన్నారు. గురువారం అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేటలో ఉపాధిహామీ కూలీలను కలిసి ప్రచారం నిర్వహించారు. గడిచిన పదేళ్లుగా కేంద్రంలోని బీజేపీ సర్కార్ ప్రజలపై పన్నుల భారం మోపుతూ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టిందని ఆరోపించారు. ఇండియా కూటమి అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు ఐ కృష్ణ, మేరుగాగు చంద్రయ్య, కొల్లూరి మల్లేష్, కోడిపుంజుల సత్తక్క, మల్లేష్, కొమురయ్య పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

అంతర్గాం, మే 9: అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేట, బ్రాహ్మణపల్లి, పొట్యాల, మద్దిర్యాల గ్రామాల్లో గురువారం దళిత సామాజిక హక్కుల పరిరక్షణ సమితి నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానికుడు, రాజకీయ అనుభవం కలిగిన కొప్పుల ఈశ్వర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిలుకు ప్రసాద్, కనుకుంట్ల రమేష్, కడమండ శ్రీహరి, రొడ్డ సంపత్, బొడ్డు రాజేశం, విజయ్, దుర్గయ్య పాల్గొన్నారు.

ముత్తారంలో..

ముత్తారం, మే 9: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని మచ్చుపేట, లక్కారం గ్రామాల్లో పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్ పుట్ట మధు ఓట్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జక్కుల ముత్తయ్య, వైస్‌ఎంపీపీ సుదాటి రవిందర్‌రావు, మండల పార్టీ అధ్యక్షులు పోతుపెద్ది కిషన్‌రెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, మాజీ ఎంపీపీ అత్తె చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో కాంగ్రెస్ వస్తేనే పేద ప్రజలకు న్యాయం



గౌరెడ్డిపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి రూరల్, మే 9 : కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే పేదల ప్రజలకు న్యాయం జరుగుతుందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండలంలోని పెద్దకల్వల, పెద్దబొంకూరు, చీకురాయి, రాంపల్లి, ముత్తారం, గౌరెడ్డిపేట గ్రామాల్లో పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా విజయరమణరావు మాట్లాడుతూ మే 13న జరిగే ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి గడ్డం వంశీకృష్ణను అధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. జడ్పీటీసీ బండారి రామ్మూర్తి, సందనవేన రాజేందర్, కారెంగల రమేష్, కోమ్ము శ్రీనివాస్, మందల సత్యనారాయణ రెడ్డి, కడార్ల శ్రీనివాస్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జూలపల్లి, మే 9 : ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలన్నీ నెరవేరుస్తామని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా బస్టాండ్ చౌరస్తాలో కార్నర్ మీటింగ్‌లో ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచి తీవ్రంగా మోసం చేసిందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని కోరారు. జడ్పీటీసీ బొద్దుల లక్ష్మీనర్సయ్య, విండో చైర్మన్ పుల్లూరి వేణుగోపాల్‌రావు, లోక జలపతిరెడ్డి, మానుమండ్ల శ్రీనివాస్, ఎండి అతిక్‌పాష, చీదురు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిని అమ్మివేయడానికి కాంగ్రెస్ కుట్రలు : మిర్యాల

గోదావరిఖని, మే 9: సింగరేణి సంస్థను ప్రైవేట్ వ్యక్తులకు అమ్మడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరిత చర్యలకు పాల్పడుతుందని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ఆరోపించారు. గురువారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బొగ్గు బ్లాకులను వేలం ప్రక్రియలో దక్కించుకోవాలని కాంగ్రెస్ పార్టీ గుర్తింపు యూనియన్ అయిన ఏఐటీయూసీతో మాట్లాడడం దుర్మార్గమన్నారు. వేలంపాటలో బొగ్గు బ్లాకులు, సింగరేణికి దక్కకుండా ప్రైవేట్ వ్యక్తులకు, సంస్థలకు దక్కితే సింగరేణి విధ్వంసం అవుతుందని చెప్పారు. ఆనాడు సంస్థకు అవసరం లేకున్నా విదేశీ యంత్రాలను కొనిపించిందని, కాంగ్రెస్ పార్టీ వల్లనే సింగరేణిలో నష్టాలు మొదలయ్యాయని ఆరోపించారు. కార్మికులు, అధికారులు పట్టుదలతోనే సంస్థను నష్టాల బారి నుంచి గట్టెక్కించారని, అదానికి చెందిన విదేశీ బొగ్గు సంస్థల నుంచి అత్యధిక ధరలకు బొగ్గు కొనుగోలు చేసి ఇక్కడికి దిగుమతి చేసుకోవడానికి త్వరలో అవగాహన కుదుర్చుకోబోతున్నారని, విదేశీ బొగ్గు దిగుమతి వల్ల సింగరేణి సంస్థపైన, బొగ్గు ఆధారిత విద్యుత్‌కేంద్రాలపైన పెనుభారం పడుతుందన్నారు. వినియోగదారులు కూడా అధిక ధరలకు విద్యుత్ కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంటుందన్నారు. దేశంలో మొట్ట మొదటగా ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ పరం చేసింది కాంగ్రెస్ పార్టీయేనని, కాంగ్రెస్ పార్టీ నూతన ఆర్థిక సంస్కరణలు తీసుకురావడం వల్ల అనేక మంది ఉపాధి కోల్పోయారని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం కూడా ప్రభుత్వరంగ సంస్థలను చౌకబారుగా అమ్మేస్తుందని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థులు కొప్పుల ఈశ్వర్, మాలోతు కవిత, నామనాగేశ్వర్‌రావు, ఆత్రం సక్కు, సుధీర్‌కుమార్‌లకు టీబీజీకేఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో నూనె కొమురయ్య, మాదాసు రామమూర్తి, పర్లపల్లి రవి, సురేందర్, నూతి రాజ్‌కుమార్, శంకర్, సాయి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఐటీ రీయింబర్స్‌మెంట్‌కు కృషి

యైటింక్లయిన్‌కాలనీ, మే 9: పన్నుల రూపంలో కోట్లాది రూపాయలు చెల్లిస్తున్న సింగరేణి కార్మికులకు ఐటీ రీయింబర్స్‌మెంట్‌కు కృషి చేస్తానని పెద్దపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ అన్నారు. గురవారం ఓసీపీ-3లో గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్మికుల చిరకాల స్వప్నమైన సొంత ఇంటి పథకాన్ని అమలుచేస్తానని పేర్కొన్నారు. కొత్త బొగ్గు గనలను ప్రారంభించడం, ఉపాధి అవకాశాలను మెరుగుపడేలా కేంద్రం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థిగా తనను గెలిపించాలని కోరారు. యూనియన్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, అసెంబ్లీ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, బీఎంఎస్ నాయకులు కుమారస్వామి, వేణుగోపాల్‌రావు, సారంగపాణి, సత్యనారాయణ, రాజేష్, రవీందర్, లింగం నాయక్ పాల్గొన్నారు.

అధికారంలో ఉన్నప్పుడు కార్మికుల కష్టాలు కనిపించలేదా? - ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

యైటింక్లయిన్‌కాలనీ, మే 9: పదేళ్ల అధికారంలో ఉన్నపుడు సింగరేణి కార్మికుల కష్టాలు కలిపించలేదా.. ఎన్నికల సమయంలో సమస్యలు పరిష్కరిస్తామని వస్తే ఎలా నమ్ముతారు అని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం వకీల్‌పల్లె గని, ఏరియా వర్క్‌షాప్‌లలో కార్మికులను కలసి మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకుల కపట ప్రేమ చూపతున్నారని, అధికారం ఇస్తే ఇక్కడే కుర్చీ వేసుకుని కుర్చుంటానని చెప్పిన కేసీఆర్ ఇటువైపు చేసింది లేదని మక్కాన్‌సింగ్ పేర్కొన్నారు. సింగరేణిని నిండా ముంచిన చరిత్ర బీఆర్‌ఎస్‌దని, ఆర్‌ఎఫ్‌సీఎల్‌ను కాకా వెంకటస్వామి ఏర్పాటు చేస్తే దానిలో మాజీ ఎమ్మెల్యే చందర్ కొలువులు అమ్ముకున్నట్లు ఆరోపించారు. సింగరేణి సంపదను కొల్లగొట్టింది బీఆర్‌ఎస్ అని, బినామీ పేర్లతో కాంట్రాక్టులు పొంది కోట్లాది రూపాయల సంపదను మూటగట్టు కున్నారని మక్కాన్‌సింగ్ ఆరోపించారు. కొప్పుల ఈశ్వర్‌కు సింగరేణి కార్మికుల ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. దోపిడీకి గురైన సింగరేణిని గాడిన పెట్టే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందని అన్నారు. పారిశ్రామిక ప్రాంతాన్ని ఇండస్ట్రియల్ హబ్‌గా మార్చనున్నట్టు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎవరైనా అవినీతికి పాల్పడి కార్మికులను వేధిస్తే నేరుగా తనకే సమాచారం ఇవ్వాలని కార్మికులకు మక్కాన్‌సింగ్ సూచించారు. కార్మికుల సొంత ఇంటి పథకాన్ని కాంగ్రెస్ అమలు చేస్తుందని, త్వరలో ఇళ్ళ పట్టాలు, 200 గజాల ఇంటి స్థలం కేటాయించేలా ప్రణాళిక సిద్ధం చేయనున్నట్టు తెలిపారు. ఎంపీగా కాకా వారసుడు గడ్డం వంశీ కృష్ణను గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో ఐఎన్‌టీయూసీ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



కార్మికులతో కలిసి టిఫిన్ చేస్తున్న మక్కాన్‌సింగ్

'జడ్పీ చైర్మన్ చేసిన ఆరోపణలు అర్థరహితం'

మంథని, మే 9: ఎంపీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆరెంద గ్రామానికి వచ్చిన జడ్పీ చైర్మన్ పుట్ట మధు తన కుటుంబం గురించి మాట్లాడిన తీరు అర్థరహితమని వైస్ ఎంపీపీ కొమ్మిడి స్వరూప్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను పార్టీ మారితే డబ్బులకు అమ్ముడుపోయానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పేద కుటుంబం నుంచి వచ్చిన ఆయనకు పలు చోట్ల వ్యవసాయ భూములు, ఫాంహౌజ్‌లు, విలాసవంతమైన ఇండ్లు ఎలా వచ్చాని కొమ్మిడి స్వరూప్, సీనియర్ కాంగ్రెస్ నేత నూకల బానయ్యలు ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భూములు కోల్పోయిన, బ్యాక్ వాటర్ కారణంగా పంటల ముంపునకు గురైన రైతులకు అధికారంలో ఉండగా ఎలాంటి సహాయం చేయలేదన్నారు. ఈసమావేశంలో ఎంపీపీ కొండ శంకర్, సింగిల్‌విండో డైరెక్టర్ రావికంటి సతీష్, నాయకులు రాజయ్య, తన్నీరు లక్ష్మణ్, మంథని శ్రీనివాస్, వాజిత్‌పాషాలు పాల్గొన్నారు.

'మహిళల సంరక్షణకు చట్టాలు'

కమాన్‌పూర్, మే 9: మహిళల సంక్షరణకు అనేక చట్టాలు ఉన్నాయని సాధికారత కేంద్ర కో ఆర్డినేటర్ దయా అరుణ అన్నారు. గురువారం మండలంలోని జూలపల్లి, కమాన్‌పూర్, నందులపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ మహిళ కూలీలకు సెర్ప్ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి పథకం ద్వారా పొందే లబ్ది గురించి వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. లింగ వివక్షతను వీడనాడాలన్నారు. పని ప్రదేశంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వెంకటరమణ, మారుతి, సీనియర్ మేటు లక్ష్మణ్, ఉపాధి హామీ కూలీలు ఉన్నారు.

'భూసార పరీక్షలు చేయించాలి'



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

పెద్దపల్లి రూరల్, మే 9: వ్యవసాయం చేసే ప్రతి రైతు భూ సార పరీక్షలు చేయించుకొని దానికి అనుగుణంగా పంటలు సాగు చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్ పిల్లి అన్నారు. గురువారం మండలంలోని బ్రాహ్మణపల్లిలో భూసార పరీక్షకు మట్టి నమూనా సేకరించే విధానంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శాస్త్రవేత్త కిరణ్ మాట్లాడుతూ ప్రతి రైతు తమ నేల యొక్క భూసారాన్ని తెలుసుకుని దానికి అనుగుణంగా ఎరువులు వాడాలని తద్వారా ఎరువుల వాడకంలో అనవసర ఖర్చులు తగ్గించి భూసారాన్ని కాపాడుకుంటూ అధిక మరియు సుస్థిర దిగుబడులు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కే వి.కే సిబ్బంది రుద్రా వినాయక్ ల్యాబ్ టెక్నీషియన్ , శ్వేత బ్రాహ్మణపల్లి వ్యవసాయ విస్తరణ అధికారి పాల్గొన్నారు.

టోపీల అందజేత

ముత్తారం, మే 9: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ రాయిని అమరేందర్‌రావు ఏఎన్‌ఎం, ఆశా సిబ్బందికి జిల్లా కలెక్టర్ గారి ఆదేశానుసారం జిల్లా వైద్య అధికారి పంపించిన టోపీలను గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది వీరేశం, శ్రీనివాస్, లక్ష్మి, టీబి సూపర్‌వైజర్ వరలక్ష్మి, ఏఎన్‌ఎంలు లావణ్య, దీప్తిలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ముత్తారం, మే 9: ముత్తారం మండలం రామకృష్ణాపూర్ గ్రామంలో ఇటీవల చింతపండు నవీన్ అనే వ్యక్తి మృతిచెందగా ఆయన చిత్రపటానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు, మాజీ జడ్పీటీసీ చొప్పరి సదానందం, ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొడ్డ బాలాజీ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు మద్దెల రాజయ్య, ముత్తారం మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు వాజిద్ పాషా సీనియర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.